క్లుప్తంగా

ఆదిత్యునికి పంచామృతాభిషేకం



జి.మామిడాడలో సూర్యనారాయణమూర్తికి అభిషేక పూజలు చేస్తున్న అర్చకులు

పెదపూడి: జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన శ్రీఉషా, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత సూర్య దేవుని సన్నిధిలో ఆదివారం స్వామికి పంచామృతాభిషేకాలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకటనరసింహాచార్యుల ఆధ్వర్యంలో ఆలయంలో వ్రత పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో హాజరైన భక్తులు స్వామి వారిని దర్శించుకుని, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఘనంగా సత్తెమ్మ తల్లి తీర్థం



సత్తెమ్మ తల్లి అమ్మవారు

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు ఎఫ్‌సీఐ గోడౌన్స్ వద్ద ఉన్న సత్తెమ్మ తల్లి తీర్థాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. శనివారం రాత్రి అమ్మవారి జాతర జరిగింది. ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. కమిటీ సభ్యులు భారీ అన్న సమారాధన నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని, అన్న సమారాధనలో పాల్గొన్నారు.

ఆశాజనకంగా మొక్కజొన్న సాగు



ఈలకొలనులో సాగవుతున్న మొక్కజొన్న పంట

రంగంపేట: మండలంలో మొక్కజొన్న సాగు ఆశాజనకంగా సాగుతోంది. ఖరీఫ్ వరి కోతలు కోసిన పొలాల్లో రబీ సీజన్‌లో భాగంగా మొక్కజొన్న సాగు చేస్తున్నారు. ప్రభుత్వం గిట్టుబాటు ధర ప్రకటించడంతో పాటు, వాతావరణం అనుకూలంగా ఉండటంతో రైతులు సాగుకు మొగ్గు చూపుతున్నారు. గతంలో కొన్ని ప్రాంతాలకే పరిమితమైన మొక్కజొన్న పంట సాగు ప్రస్తుతం మండలంలోని అన్ని ప్రాంతాలకు విస్తరించింది.

కోదండరాముడి విగ్రహ ప్రతిష్ఠ పూజలు

బిక్కవోలు: పందలపాక గ్రామంలోని నూతనగా నిర్మిస్తున్న రెడ్ల రామాలయం వద్ద విగ్రహ ప్రతిష్ఠ పూజలు ఆదివారం కొనసాగాయి. అర్చకులు యలమంచిలి ప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో వాస్తు పూజ, 12 నదుల జలాలతో జలాధివాసం, ధాన్యాధివాసం, క్షీరాభిషేకం, హోమాలు నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ కొవ్వూరి గోపాలకృష్ణారెడ్డి, కరుణావతి దంపతులతో పాటు, పలువురు దంపతులు ప్రత్యేక పూజలు చేయించారు. భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

విద్యార్థికి పాముకాటు



విద్యార్థిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

పెదపూడి: అనపర్తి మండలం లక్ష్మీనరసాపురం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న నిస్సి అనే విద్యార్థి శనివారం రాత్రి పాముకాటుకు గురయ్యాడు. వెంటనే అతడిని ప్రిన్సిపాల్ అనపర్తిలోని ఏరియా ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతున్నాడు. ఆదివారం ఆస్పత్రిలో ఆ విద్యార్థిని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పరామర్శించారు. వైద్యులు, ప్రిన్సిపాల్‌తో విద్యార్థి ఆరోగ్య పరిస్థితిని ఆరాతీశారు. అతడి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. విద్యార్థికి ప్రాణాపాయం లేదన్నారు.

నేటి నుంచి వాటర్ ప్రాజెక్ట్ సిబ్బంది సమ్మె

సీతానగరం: మండలంలోని పురుషోత్తపట్నంలో ఉన్న సత్యసాయి ప్రాజెక్ట్ వర్కర్స్, మెయిన్‌టెనెన్స్ యూనియన్ సోమవారం నుంచి సమ్మెకు దిగడంతో శుద్ధి చేసిన గోదావరి జలాలు 90 గ్రామాలకు నిలిచిపోనుంది. గత 20 నెలలుగా జీతాలు అందించని కారణంగా యూనియన్ సమ్మెకు దిగింది. దీంతో సీతానగరం, దేవీపట్నం, గోకవరం, రాజానగరం, కోరుకొండ మండలాల్లోని అనేక గ్రామాలకు శుద్ధి అయిన గోదావరి నీటి సరఫరా నిలిచిపోనుంది.

అంతన్నారు.. ఇంతన్నారే..!

- రోడ్లను గాలికొదిలేసిన కూటమి ప్రభుత్వం
- కాతేరు-సీతానగరం రోడ్డులో కల్వర్టుల వద్ద కానరాని రహదారి
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రూ.70 కోట్లతో నాలుగు లేన్ల రోడ్డు
- మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కృషి ఫలితమే..



గోతులతో రఘుదేవపురం-సీతానగరం రోడ్డు



ముగ్గళ్ల కల్వర్టు వద్ద వేయని రోడ్డు

సీతానగరం: ఎన్నికల ముందు అంతా.. ఇంతా అన్నారు. ఎన్నికల తరువాత చివరకు ఏమీ లేకుండా చేశారు. కాతేరు-సీతానగరం ఆర్‌అండ్‌బీ రోడ్డు దుస్థితే ఇందుకు నిదర్శనం. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన రోడ్డుపైనే వాహనాల రాకపోకలు సాఫీగా సాగుతున్నాయి. ఈ రోడ్డుకు మూడు గ్రామాల వద్ద కల్వర్టుకు ఇరువైపులా రహదారి నిర్మించాల్సి ఉండగా, ఇంత వరకూ కూటమి ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాలు లేవు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కృషి ఫలితంగా కాతేరు-సీతానగరం నాలుగు లైన్ల రోడ్డు మంజూరు చేయించి, స్టేట్ హైవేలో చేర్చారు. రోడ్డుకు రూ.70 కోట్ల నిధులు రాబట్టి, నాలుగు లైన్ల విస్తరణ పనులు చేపట్టారు. కాతేరు నుంచి రఘుదేవపురం శివారు వరకు నాలుగు లైన్ల రోడ్డు పనులూ పూర్తయ్యాయి.

రఘుదేవపురం-సీతానగరం రోడ్డు నిల్

వైఎస్సార్ సీపీ హయాంలో కాతేరు నుంచి రఘుదేవపురం శివారుకు నాలుగు లైన్ల రోడ్డు పూర్తయింది. రఘుదేవపురం నుంచి సీతానగరం పెట్రోల్ బంక్ వరకు సుమారు 1.5 కి.మీ. ఎన్నికల కోడ్‌తో నాలుగు లైన్ల విస్తరణ పనులు స్తంభించాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ రోడ్డు నిర్మాణం కొనసాగుతుందని ఎదురు చూసిన మండల ప్రజలకు నిరాశే ఎదురైంది. రోడ్డుపై పాలకులు కనీస దృష్టి సారించిన దాఖలాలు లేవు. పోలవరం ప్రాజెక్ట్‌లో వదిలేసిన క్వారీ బూడిదను వేసి మమ అనిపించారు.



మునికూడలి కల్వర్టు వద్ద ఇలా..



కాటవరం కల్వర్టు వద్ద కానరాని రోడ్డు

కల్వర్టు వద్ద వేయని రోడ్డు

ఈ రహదారిలో కల్వర్టుల వద్ద రోడ్డు వేయడానికి ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక.. కాటవరం, మునికూడలి, ముగ్గళ్ల వద్ద కల్వర్టులకు ఇరువైపులా సిమెంట్ కాంక్రీట్ రోడ్డు వేయాల్సి ఉంది. ఒకొక్క కల్వర్టు వద్ద 30 నుంచి 40 మీటర్ల రోడ్డు నిర్మించాల్సి ఉంది.

ఇంత వరకూ కూటమి పాలకులు పట్టించుకోలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. స్థానిక ప్రజాప్రతినిధులూ దీనిపై కనీస దృష్టి సారించలేదంటున్నారు.

ఆర్‌అండ్‌బీ అధికారులు రూ.34 కోట్ల నిధులు ఇందుకు అవసరం అవుతాయని ఉన్నతాధికారులకు నివేదిక పంపించారు. ఈ చిన్న పనులు పూర్తి చేయలేని కూటమి ప్రభుత్వం.. భవిష్యత్తులో నియోజకవర్గాన్ని ఎలా అభివృద్ధి చేస్తారంటూ ప్రజలు పెదవి విరుస్తున్నారు.

అభివృద్ధి ఏమీ లేదు



కాతేరు-సీతానగరం నాలుగు లైన్ల రోడ్డు పనులు రఘుదేవపురం వరకు పూర్తయినా, మూడు గ్రామాల వద్ద కల్వర్టుల వద్ద ఇరువైపులా కొద్దిపాటి రోడ్డు నిర్మిస్తే సరిపోతుంది. కానీ ఇంతవరకూ కొద్దిపాటి పనులు చేయలేని పరిస్థితిలో కూటమి ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు ఉన్నారు. ఈ కొద్దిపాటి పనులు ఎప్పుడు పూర్తి చేస్తారా అని మండల ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఎన్నికల ముందు ఏవేవో చెప్పారు. గెలిచాక ఏమీ లేదనిపించారు. ప్రజలకు ఉపయోగపడే ఈ కొద్దిపాటి రోడ్డు పనులు సత్వరమే పూర్తి చేయాలి.

– పెదపాటి ప్రసాద్, సీతానగరం

రఘుదేవపురం నుంచి రోడ్డు వేయాలి



గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కాతేరు నుంచి రఘుదేవపురం శివారు వరకు రోడ్డు పనులు పూర్తయ్యాయి. రఘుదేవపురం నుంచి సీతానగరం వరకు రోడ్డును ఎన్నికల కోడ్‌తో పనులు నిలిపివేశారు. కూటమి ప్రభుత్వంలో దీనిని పూర్తి చేస్తుందని ప్రజలు ఆశగా ఎదురు చూశారు. అయితే అసలు పట్టించుకున్న దాఖలాలే లేవు. ఎన్నికల సమయంలో ఏవేవో చెప్పారు. తీరా అధికారంలోకి వచ్చాక ఏమీ చేయలేని పరిస్థితిలో కూటమి నేతలు ఉన్నారు. ఇప్పటికైనా రోడ్డు పనులు పూర్తి చేయాలి.

– వలవల వెంకట్రాజు, రాష్ట్ర కార్యదర్శి, రైతు విభాగం, వైఎస్సార్ సీపీ, సీతానగరం

టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

సీతానగరం: మండలంలో 686 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరుకానున్నారని ఎంఈవో కె.స్వామినాయక్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, సోమవారం నుంచి జరిగే పదో తరగతి పరీక్షలకు నాలుగు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. సీతానగరం ప్రభుత్వ హైస్కూల్, రఘుదేవపురం, వెదుళ్లపల్లిలోని జిల్లా పరిషత్ హైస్కూల్, చిన కొండేపూడిలోని సూర్యచంద్ర ప్రైవేట్ హైస్కూల్‌లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలకు చెందిన బాలురు 198 మంది, బాలికలు 218 మంది పరీక్షలు రాస్తున్నారని తెలిపారు. అలాగే ప్రైవేట్ స్కూళ్ల నుంచి బాలురు 141, బాలికలు 129 మంది రాస్తున్నారని వివరించారు. ఆయా పరీక్షా కేంద్రాల్లో తాగునీటి సౌకర్యం, విద్యుత్, టాయ్‌లెట్ల సదుపాయం, వైద్య సిబ్బందిని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పరీక్షలు రాసే విద్యార్థులు ఆర్టీసీ బస్సుల్లో హాల్ టికెట్ చూపించి ఉచితంగా ప్రయాణం చేయవచ్చన్నారు. పరీక్షా సమయం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు ఉంటుందని తెలిపారు. విద్యార్థులు అరగంట ముందుగా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని ఎంఈవో స్పష్టం చేశారు.

మూడు పరీక్షా కేంద్రాలు

బిక్కవోలు: మండలంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈవో-1 సీహెచ్‌వీ సత్యనారాయణ ఆదివారం తెలిపారు. మండలంలోని పందలపాక, బిక్కవోలు, బలభద్రపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పరీక్షలు జరుగుతాయన్నారు. బిక్కవోలు కేంద్రంలో బిక్కవోలు, ఇలపల్లి ఉన్నత పాఠశాలల విద్యార్థులు 192 మంది, బలభద్రపురం కేంద్రంలో బలభద్రపురం, బిక్కవోలు ప్రైవేటు నేతాజీ, సూర్యతేజ విద్యార్థులు 155 మంది, పందలపాక కేంద్రంలో పందలపాక, ఊలపల్లి, కొంకుదురు, మెళ్లూరు ఉన్నత పాఠశాలల విద్యార్థులు 250 మంది మొత్తం 597 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారని వివరించారు. ఆయా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్ష జరుగుతుందన్నారు. పరీక్షా సమయానికి అరగంట ముందు హాల్ టికెట్‌తో హాజరవ్వాలన్నారు. పరీక్ష కేంద్రం వద్ద ఫర్నిచర్, ఫ్యాన్లు, మరుగుదొడ్ల సదుపాయాలు కల్పించామని తెలిపారు.

సమన్వయంతో విధులు నిర్వర్తించాలి

– ఎంపీడీఓ ఝాన్సీ

రాజానగరం: గ్రామాభివృద్ధిలో ప్రజాప్రతినిధుల సహకారం తీసుకుంటూ, వివాదాలకు తావులేకుండా సమన్వయంతో విధులు నిర్వర్తించాలని ఎంపీడీఓ జేఏ ఝాన్సీ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఎంపీపీ మండారపు సీతారత్నం అధ్యక్షతన స్థానిక మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం మీటింగ్ హాలులో ఆదివారం మండల సమావేశం జరిగింది. వివిధ ప్రభుత్వ శాఖల వివరాలను ఆయా శాఖల అధికారులు వివరించారు. ఈ సమయంలో కొంతమంది సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు జోక్యం చేసుకుని, తమ గ్రామాలలో ఎప్పుడు, ఏం జరుగుతుందో తమకు తెలియడం లేదని, ప్రజాప్రతినిధులుగా తమకు వాటిని తెలుసుకునే హక్కు లేదా అంటూ ప్రశ్నించారు. దీనిపై ఎంపీడీఓ స్పందిస్తూ, ఇకపై అటువంటి పరిస్థితులు ఎదురు కాకుండా చూస్తామన్నారు. అదే సమయంలో పంచాయతీ కార్యదర్శులకు వారి బాధ్యతలను కూడా గుర్తు చేశారు. రోజురోజుకూ ఎండల తీవ్రత పెరిగిపోతుందని, తాగు నీటి సమస్య ఎదురు కాకుండా అంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో విజయవంతం చేయడం అందరి బాధ్యత అని గుర్తు చేశారు. రెవెన్యూ పరమైన సమస్యలపై తహసీల్దార్ జీఏఎల్ఎస్ దేవి సమాధానాలిచ్చారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ హాజరుకావాల్స ఉంది. దీంతో ఉదయం 10.30కు ప్రారంభమైన సమావేశాన్ని ఆయన రాక కోసం మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించారు. ఆయన కోసమే ఆదివారం మండల సమావేశం నిర్వహించినప్పటికీ, ఎమ్మెల్యే హాజరు కాలేదని ఎంపీపీ విమర్శించారు.



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఝాన్సీ

ఉపదేశమిచ్చేది మహా భారతం

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): మహాభారతం ఉపదేశంతో కూడిందని పశ్చిమ గోదావరి జిల్లా కైకరానికి చెందిన జటావల్లభుల రామమూర్తి అన్నారు. అజ్ఞాతవాసంలో దొరకకుండా ఉండాలనే పాండవులకు, దొరుకుతారని ఎదురుచూసే కౌరవులకు విరాట్ పర్వం ఓ పరీక్ష లాంటిదన్నారు. నన్నయ మహాభారతాన్ని తెలుగులో రాయడానికి శ్రీకారం చుట్టి, రెండున్నర పర్వాలు పూర్తి చేస్తే, విరాట్ పర్వం నుంచి తిక్కన సోమయాజి మహాభారత రచన కొనసాగించి, 15 పర్వాలు పూర్తిచేశాడని చెప్పారు. స్థానిక మెయిన్ రోడ్‌లోని శ్రీశివరామకృష్ణ మారుతీ స్వరూప సమర్థ సద్గురు సాయినాథ శ్రీషిర్డీసాయి మందిర 13వ వార్షిక మహోత్సవాలు రెండో రోజైన ఆదివారం కొనసాగాయి. సాయంత్రం జటావల్లభుల రామమూర్తి.. మహాభారతంలోని విరాటపర్వంపై ప్రవచించారు. కీచక వధ ఘట్టాన్ని ప్రస్తావిస్తూ, పరస్త్రీ వ్యామోహం ఉంటే ఎలాంటి చావు వస్తుందో భీమసేనుడు చూపించాడని వివరించారు. వక్తను అద్దంకి వేంకట ప్రభాకర శ్రీరామచంద్రరావు, రావిపాటి మదన గోపాలస్వామి అభినందించారు. అనంతరం ఎం.ఈశ్వరకుమార దేవ్ వీణ కచేరితో అలరించారు. మృదంగంతో అనపిండి కామేశ్వరరావు, ఘటంపై రాయప్రోలు బాలదినకర్ సహకరించారు.



వీణ కచేరి చేస్తున్న ఈశ్వరకుమార్‌దేవ్

భయపెడుతున్న గ్రామ సింహాలు

రంగంపేట: చంద్రేడు గ్రామంలో కొద్ది రోజులుగా కుక్కల బెడద అధికమైంది. దారిన పోయేవారిపై దాడి చేస్తుండడంతో, రోడ్లపై తిరగడానికి ప్రజలు వణికిపోతున్నారు. ముఖ్యంగా మధ్యాహ్నం, సాయంత్రం, రాత్రి సమయాల్లో వీధి కుక్కలు గుంపులుగా సంచరిస్తూ, వీధుల్లో వెళ్లేవారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. కుక్కలకు భయపడి అవి ఉన్న దారి నుంచి వెళ్లకుండా, వేరే మార్గాల నుంచి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఒంటరిగా వెళ్లే పిల్లలు, వృద్ధులు, మహిళలు భయభ్రాంతులకు గురవుతున్నారు. వీధి కుక్కలు ఇళ్లల్లోకి సైతం చొరబడుతున్నాయని, ఎదిరిస్తే గాయపరుస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంటి ఆవరణలో ఉన్న కోళ్లను ఎత్తుకుపోతున్నాయని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, వీధి కుక్కల బెడద నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.



చంద్రేడులో గుంపుగా సంచరిస్తున్న కుక్కలు

స్త్రీ మూర్తికి అండగా..

- మహిళల కోసం అందుబాటులోకి పింక్ టాయ్‌లెట్లు
- మరిన్ని చోట్ల ఏర్పాటుకు ప్రణాళిక
- రూ.10 లక్షలతో నిర్మాణం
- ఇందులో అతివలకు ఎన్నో సౌకర్యాలు



నూతనంగా నిర్మించిన పింక్ టాయ్‌లెట్

రాజమహేంద్రవరం సిటీ: స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమాల్లో భాగంగా నగరంలో మహిళలకు సౌకర్యవంతంగా ఉండేలా ప్రత్యేక ఏర్పాట్లతో పింక్ టాయ్‌లెట్ల ఏర్పాటుకు నగరపాలక సంస్థ చర్యలు చేపట్టింది. నగరంలోని మూడో పట్టణ పోలీస్ స్టేషన్ ఎదురుగా కోర్టు ఆవరణను ఆనుకుని రూ.పది లక్షల వ్యయంతో ప్రయోగాత్మకంగా పింక్ టాయ్‌లెట్‌ను నిర్మించారు. ఇందులో ఐదు టాయ్‌లెట్ గదులు ఏర్పాటు చేశారు. పూర్తి స్థాయిలో హైజెనిక్‌గా ఉండేలా ఏర్పాటు చేయడంతో పాటు, టాయ్‌లెట్ల నిర్వహణకు ప్రత్యేక కేర్ టేకర్‌ను నియమించారు. చంటి పిల్లలతో వచ్చే మహిళలకు బిడ్డలకు పాలు పట్టించేందుకు వీలుగా ప్రత్యేక గదిని కేటాయించారు. ఫ్యాన్‌తో పాటు, చిన్న పిల్లలను పడుకోబెట్టేందుకు ఉయ్యాలను కూడా ఏర్పాటు చేశారు. దేశవ్యాప్తంగా స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా ప్రతి నగరంలో ఇలాంటి టాయ్‌లెట్లను ఏర్పాటు చేయాలనే ప్రభుత్వ ఆదేశాలతో ఈ పింక్ టాయ్‌లెట్ల నిర్మాణం చేపట్టినట్టు నగరపాలక సంస్థ అధికారులు వెల్లడించారు. మహిళా దినోత్సవం రోజున కలెక్టర్ ప్రశాంతి దీనిని ప్రారంభించి, నగర ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు.

నాప్కిన్ మెషీన్

పింక్ టాయ్‌లెట్లలో మహిళలు, యువతులకు అవసరమైన నాప్కిన్లను అందించేందుకు ఆధునిక నాప్కిన్ విక్రయించే యంత్రాన్ని ఏర్పాటు చేశారు. అతి తక్కువ ధరతో కేవలం రూ.5కే శానిటరీ నాప్కిన్‌ను ఈ మెషీన్ అందిస్తుంది. మెషీన్‌లో ఐదు రూపాయల కాయిన్ వేస్తే శానిటరీ నాప్కిన్ బయటకు వస్తుంది.



నాప్కిన్ వెండింగ్ మెషీన్



చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన ప్రదేశం

విశ్రాంతి తీసుకునేలా..

ఈ సెంటర్‌లో మహిళలు విశ్రాంతి తీసుకోవడానికి తగిన ఏర్పాట్లు చేశారు. స్నానం చేసేందుకు కూడా సౌకర్యాలున్నాయి. చిన్న పిల్లలకు డైపర్స్ మార్చుకోవడానికి వసతి కల్పించారు. గోదావరి పుష్కరాల రేవుకు సమీపంలో దీనిని ఏర్పాటు చేయడంతో, వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చే మహిళలకు ఇదెంతో సౌకర్యంగా ఉంటుందంటున్నారు.


సౌకర్యంగా ఉంది



మహిళలకు అన్ని విధాలా సౌకర్యంగా ఉండే విధంగా పింక్ టాయ్‌లెట్ల నిర్మాణం బాగుంది. చిన్నారులకు పాలు పట్టే సమయంలో, బహిరంగ ప్రదేశాల్లో ఇబ్బందులు పడకుండా, ఈ విధమైన సౌకర్యాలతో ప్రత్యేకంగా ఏర్పాటు చేయడం అభినందనీయం. నగరంలో మరిన్ని చోట్ల ఇలాంటివి ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

– బైరెడ్డి లతారెడ్డి, రాజమహేంద్రవరం

మరిన్ని ఏర్పాటు చేస్తాం



ఇది పూర్తిగా మహిళల కోసం మాత్రమే ఏర్పాటు చేశారు. వీలైనంత ఎక్కువ మంది మహిళలు వీటిని ఉపయోగించుకోవాలి. నగరంలో మరిన్ని ప్రాంతాల్లో పింక్ టాయ్‌లెట్ల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.

– డాక్టర్ వినూత్న, ఆరోగ్య విభాగం అధికారి, నగరపాలక సంస్థ

చిరస్మరణీయుడు పొట్టి శ్రీరాములు



పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న డాక్టర్‌బాబు తదితరులు

సీతానగరం: ఆంధ్ర రాష్ట్ర అవతరణకు ఎనలేని కృషి, ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములును మరువలేమని వైఎస్సార్ సీపీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు అన్నారు. ఆయన జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక మదర్ థెరిస్సా సెంటర్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహంతో పాటు, గాంధీ, మదర్‌థెరిస్సా, వైఎస్సార్ విగ్రహాలకు డాక్టర్‌బాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అమరజీవి పొట్టి శ్రీరాములు తెలుగు వారందరికీ చిరస్మరణీయుడన్నారు. ఆయన పోరాటం ఫలితంగా 1953 అక్టోబర్ ఒకటిన కర్నూలు రాజధానిగా ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు షేక్ మీరా, నాగుబండు జగదీష్, రాంబాబు, పెన్నాడ పెద్దోడు, పెదపాటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు వస్త్రాల పంపిణీ



అనపర్తిలో వృద్ధులకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న దాతలు

పెదపూడి: అనపర్తిలోని రైజింగ్ హ్యాండ్స్ ఫర్ హోప్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో తేతలి రామిరెడ్డి మంగాయమ్మ మహిళా వృద్ధాశ్రమంలో ఆదివారం వస్త్రాలు, భోజనాన్ని పంపిణీ చేశారు. రాయుడు సూరమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె కుమారుడు శ్రీనివాసరావు, ఆదిలక్ష్మి వృద్ధులకు వస్త్రాలు, భోజనాలు, స్నాక్స్ అందించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ, తమ సేవా సంస్థ నుంచి మరింత సామాజిక సేవా కార్యక్రమాలు విస్తరించడానికి కృషి చేస్తున్నామన్నారు. డాక్టర్ నల్లమిల్లి ఆదిరెడ్డి, మురళీ, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కోడిపందేలపై పోలీసు దాడి

సీతానగరం: వంగలపూడి శివారున నిర్వహిస్తున్న కోడిపందేలపై పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా ఇద్దరిని అరెస్ట్ చేసి, కేసు నమోదు చేశామని ఎస్సై డి.రామ్‌కుమార్ ఆదివారం తెలిపారు. వంగలపూడి శివారున కోడిపందేలు ఆడుతున్నట్టు సమాచారం అందడంతో, ఈ దాడి చేశారు. వంగలపూడికి చెందిన ఇద్దరిని అరెస్టు చేసి, రెండు పందెం కోళ్లు, రెండు కత్తులు, రూ.500 నగదు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేశామని, కోర్టులో హాజరుపర్చుతామని ఎస్సై తెలిపారు.

పడాల సత్తెమ్మ తల్లి సంబరం



కొంకుదురులో సత్తెమ్మ తల్లి గ్రామోత్సవం

బిక్కవోలు: కొంకుదురు గ్రామంలోని పడాల వంశీయుల కులదేవత సత్తెమ్మ తల్లి సంబరం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పడాల వంశీయుల ఆడపడుచుల రాకతో గ్రామమంతా కళాకళలాడింది. గరగ నృత్యాలు, తీన్మార్ డప్పులు, బాణసంచా కాల్పుల నడుమ అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం భారీఎత్తున అన్న సమారాధన జరిగింది.

నేడే అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ



బిక్కవోలు: మండలంలోని ఊలపల్లి గ్రామంలో శెట్టిబలిజపేటలో నూతనంగా ఏర్పాటు చేసిన 32 అడుగుల భారీ ఆంజనేయస్వామి విగ్రహాన్ని సోమవారం ప్రతిష్ఠించనున్నారు. ఆదివారం ఈ సందర్భంగా ఉదయం నుంచి స్వామివారి విగ్రహానికి క్షీరాధివాసం, జలాధివాసం, హోమాలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం విగ్రహ ప్రతిష్ఠ అనంతరం పంచామృతాభిషేకాలు, భారీఎత్తున అన్న సమారాధన ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

యువతి అదృశ్యం

రాజమహేంద్రవరం రూరల్: ఇంటి నుంచి వెళ్లిన తన కుమార్తె తిరిగి రాలేదని శాటిలైట్‌సిటీ సి-బ్లాక్‌కు చెందిన పి.మాధవి ఆదివారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల వివరాల మేరకు, శాటిలైట్‌సిటీ గ్రామానికి చెందిన 18 ఏళ్ల యువతిని ఆమె తల్లి మందలించింది. శనివారం సాయంత్రం ఐదు గంటల సమయంలో ఆ యువతి ఇంటి నుంచి వెళ్లింది. అప్పటి నుంచి తిరిగిరాలేదని ఆమె తల్లి పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొంది.